
సాక్షి ఒడిశా

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,28,537లు, బంగారం 5 గ్రాముల 380 మిల్లీగ్రాములు వెండి 172 గ్రాముల 740 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జల జగడానికి ఫుల్‌స్టాప్..!

త్వరలో మహానది జలాల పంపిణీ వివాదం పరిష్కారం కానుందని కేంద్రమంత్రి పాటిల్ అన్నారు.

- 8లో



సౌర విద్యుత్ పెంపొందించేందుకు కృషి

రాష్ట్రంలో సౌర విద్యుచ్ఛక్తి వినియోగం పెంపొందించేందుకు ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని సీఎస్ మనోజ్ ఆహూజా అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నడిసంద్రంలో చిక్కుకున్న పడవ



సముద్రంలో చిక్కుకున్న పడవలు

భువనేశ్వర్: పారాదీప్ సముద్రంలో చేపల పడవ చిక్కుకుంది. బంగాళాఖాతంలో అలజడి వాతావరణంతో వేటకు వెళ్లిన మత్స్యకారులతో ఉన్న పడవ చిక్కుకోవడంపై సర్వత్రా ఆందోళన చోటు చేసుకుంది. ఈ పడవలో 14 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిని కాపాడేందుకు వెళ్లిన తోటి మత్స్యకారుల మరో పడవ సైతం ఇక్కట్లో చిక్కుకుంది. యాంత్రిక లోపంతో చిక్కుకున్న పడవని లాగేందుకు తాడు కట్టి లాగబోయే ప్రయత్నంలో రెండో పడవ చిక్కుకుంది. వీరిని రక్షించి తీరానికి సురక్షితంగా తరలించేందుకు పారదీప్ ఓడ రేవు, మెరైన్ ఠాణా పోలీసులు, కోస్టు గార్డు యంత్రాంగం రంగంలోకి దిగింది. వీరంతా 2 పడవల్లో ఘటనా స్థలానికి చేరారు.

పూజా పందిళ్లపై హైకోర్టు ఆంక్షలు

భువనేశ్వర్: దేవీ నవరాత్రుల పూజలు పురస్కరించుకొని పందిళ్ల ఏర్పాటుపై రాష్ట్ర హైకోర్టు ఆంక్షలు విధించింది. దుర్గా పూజోత్సవాలకు కటక్ మహా నగరం పేరొందింది. నగరంలో పోటాపోటీగా నింగికి తాకే పందిళ్లు, బాట తోరణాలు భారీగా ఏర్పాటు చేస్తారు. అయితే నడి రోడ్డు మీద వీటి ఏర్పాటు నివారించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలో ఇటీవల రహదారుల పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. వీటిపై భారీ పందిళ్ల ఏర్పాటు శ్రేయస్కరం హైకోర్టు అభిప్రాయపడింది. మరోవైపు శబ్ద కాలుష్య నివారణ నేపథ్యంలో ఊరేగింపు పురస్కరించుకుని డీజే వినియోగం నిషేధించిన విషయం తెలిసిందే.

రాయగడలో డీఆర్‌ఎం పర్యటన



సాయి ఇంటర్నేషనల్ ప్రాంతంలో పర్యటిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

రాయగడ: విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం రాయగడలో పర్యటించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విజయనగరం నుంచి టిట్లాఘడ్ వరకు నిర్మితమవుతున్న మూడోలైన్ పనులు పర్యవేక్షించిన ఆయన, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా స్థానిక సాయి ఇంటర్నేషనల్ మార్గంలోని రైల్వే ప్రాంతంలో కొత్తగా నిర్మించనున్న డీఆర్‌ఎం కార్యాలయం కోసం స్థల పరిశీలన చేశారు.

చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి




చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మృతి చెందిన చిన్నారులు(ఫైల్)

కొరాపుట్: చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన జిల్లాలోని లమ్తాపుట్ సమితి కుమార్ గందస్ గ్రామ పంచాయతీ కుమార్ పలువా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శంకర్ కుంబార్ కుమార్తై చంపా కుంబార్ (5), బొడపలిగుడ గ్రామానికి చెందిన వృద్ధవ్ కుంబార్ కుమారుడు బలభద్ర కుంబార్ (4)లు చెరువు వద్ద ఆడుకోవడం గ్రామస్తులు గమనించారు. అయితే కొంతసేపటి తర్వాత వీరు కనిపించకపోవడంతో గ్రామంలో అన్నిచోట్ల గాలించారు. అయినా వారు కనిపించకపోవడంతో నందపూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి చెరువులో గాలించగా ఇద్దరు చిన్నారులు దొరికారు. దీంతో వారిని వెంటనే హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కుండపోత..!



వరద ముంపునకు చేరువలో సువర్ణ రేఖ నది



జలేశ్వర్ ప్రాంతంలో ఉరకలేస్తున్న జలకా నది

- రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- నిండికుండలా జలాశయాలు
- పలు ప్రాంతాలకు వరద ముప్పు

భువనేశ్వర్: అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర, కోస్తా ఒడిశా ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. బుధవారం నుంచి ఇదే పరిస్థితి నిరవధికంగా కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వానలతో వరదల నుంచి బాలాసోర్ జిల్లా కోలుకోక ముందే మరోసారి వరద ఉధృతి సంకేతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రముఖ నదుల్లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. కోస్తా ఒడిశాలో జగత్‌సింగ్‌పూర్, పూరీ, కటక్, ఖుర్దా జిల్లాలకు వాతావరణ శాఖ అరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. ఉత్తర ఒడిశాలో మయూర్‌భంజ్, కెంజొహర్, జాజ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా ప్రాంతాల్లో తెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ఈ జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ అయింది.

సువర్ణ రేఖకు వరద సంకేతం

ఎగువ ప్రాంతంలో కుండపోత వానలతో జలేశ్వర్ ప్రాంతంలో సువర్ణ రేఖ నీటిమట్టం పెరిగింది. ఝార్ఖండ్ గల్లిడిహి జలాశయం నుంచి వరద నీరు విడుదల చేయడంతో ఈ ప్రాంతానికి వరద ముంపు పొంచి ఉన్నట్లు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఎగువ నుంచి 2,200 క్యూసెక్కుల వరద నీరు దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. గల్లిడిహి జలాశయం గరిష్ఠ నీటిమట్టం 94.5 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 101.25 మీటర్లు కొనసాగుతున్నందున లోతట్టు ప్రాంతాలకు వరద నీరు విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు గల్లిడిహి జలాశయం నుంచి వరద నీరు విడుదల చేసినట్లు కేంద్ర జల కమిషన్ తెలిపింది.

బిక్కుబిక్కుమంటున్న ప్రజలు

ఇటీవల వచ్చిన వరదల నుంచి పూర్తిగా కోలుకోని ప్రజలు పొంగుతున్న వరద నీటిమట్టంపై తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బలహీన నదిగట్ల తీర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమని జీవిస్తున్నారు. ఝులకా నది ఉధృతితో ఇటీవలి వరదలో సుమారు 10 పంచాయతీలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నదీతీరం మయూర్‌భంజ్ జిల్లాలో రాసగోవిందపూర్, మొరొడా, సుల్వాన్‌పొడా, చిత్తడ పంచాయితీ వాసులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు.



మయూర్‌భంజ్‌లోని కాలో ఆనకట్ట నుంచి వరద నీరు విడుదల

ఉరుకుతున్న ఝులకా నది

బాలాసోర్ జిల్లాలో ఝులకా నది ఉరకలేస్తోంది. ఈ నదిలో నీటిమట్టం ప్రమాద సంకేతం దాటింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు విడుదల అవుతోంది. ఈ నది బొస్తా తీరం మథాని ప్రాంతంలో గరిష్ఠ నీటి పరిమితి 6 మీటర్లు అధిగమించి 6.24 మీటర్ల ఎత్తున పొంగిపొర్లుతోంది.

అర్కక్షేత్రం జల దిగ్బంధం



ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అర్క క్షేత్రం కోణార్క్ జల దిబ్బంధంలో చిక్కుకుంది. కుండపోత వానలతో కోణార్కు సూర్య దేవాలయం ప్రాంగణంలో మోకాలి లోతు నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంగణం ఉత్తర దిశలో నీటి ప్రవాహానికి అంతరాయం కలగడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నీటి నిల్వ తొలగించేందుకు పంపుసెట్లు ఏర్పాటు చేశారు.

– భువనేశ్వర్

పూరీలో పాఠశాలలకు సెలవు

అల్పపీడనం తాకిడితో పూరీ జిల్లాలో గత రెండు రోజులుగా నిరవధికంగా వాన కురుస్తోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా యంత్రాంగం గురువారం సెలవు ప్రకటించింది. వీటి అనుబంధ అంగన్‌వాడీ కేంద్రాలకు జిల్లా అధికారులు సెలవు ప్రకటించారు. పూరీలో మైనర్ బాలుడు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మృత బాలుడు రెండో తరగతి విద్యార్థి. కాకత్‌పూర్ – అస్తరంగ్ ప్రాంతం గంగాపూర్ గ్రామం చెరువులో స్నానం చేస్తూ కొట్టుకుపోవడంతో మరణించినట్లు భావిస్తున్నారు. గురువారం ఉదయం స్నానానికి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. గాలించడంతో చెరువులో తేలుతున్నట్లు గుర్తించారు. హుటాహుటిన బాలుడిని ఒడ్డుకు తెచ్చి చికిత్స కోసం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు ప్రకటించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



ప్రమాదానికి కారణమైన ఇల్లు

- ముగ్గురుకి గాయాలు

రాయగడ: విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలుపాలయ్యారు. గురువారం ఉదయం స్థానిక రైతుల కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు అంబాగుడ ప్రాంతానికి చెందిన దుశ్శాసన్ ఖొర(35)గా గుర్తించగా, గాయాలైనవారిలో బినోద్ నాగ్, లక్ష్మణ్ కొంధొపాణి, దామోదర్ గంటలు ఉన్నారు. గాయాలైనవారిలో లక్ష్మణ్ కొంధొపాణి, బినోద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతుల కాలనీలో కొత్తగా నిర్మించిన ఒక ఇంటికి సున్నాలు వేసేందుకు నలుగురు యువకులు వెళ్లారు. ఈ క్రమంలో సున్నాలు వేస్తున్న సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ తీగ గోడకు తగలడంతో విద్యుత్ షాక్‌తో నలుగురు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో దుస్సాషన్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమీపంలోని 33 కేవీ విద్యుత్ లైన్ ఉన్నప్పటికీ, అది గమనించకుండా ఇంటి యజమాని సున్నాలు వేసేందుకు సన్నహాలు చేయడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని బాధితులు ఆరోపిస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గాయాలతో చికిత్స పొందుతున్న కంధపాణి



చికిత్స పొందుతున్న బినోద్ నాగ్

వర్షపాతం వివరాలు

రాష్ట్రంలో పలుచోట్ల గురువారం భారీ వర్షపాతం నమోదయ్యింది. వివిధ ప్రాంతాల్లో 7 మిల్లీమీటర్ల నుంచి 46 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యింది.

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
బౌధ్	46.0
పారాదీప్	32.4
చాంద్‌బాలి	29.0
భువనేశ్వర్	26.3
నువాపడా	25.4
ఖుర్దా	25.0
జాజ్‌పూర్	25.0
పర్లాకిమిడి	21.0
భవానీపట్న	17.0
బర్‌గడ్	15.4
కటక్	15.2
భద్రక్	14.0
కేంద్రాపడా	12.2
జగత్‌సింగ్‌పూర్	12.0
బాలాసోర్	10.8
రాయగడ	10.4
గోపాలపూర్	7.6
పూరీ	6.6
ఛత్రపురం	6.2

15 దేశాలు..
160 పరిశోధన పత్రాలు



వికసిత్ భారత్‌పై సావనీర్ విడుదల చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డాక్టర్ రబినారాయణ సుబుద్ధి

పర్లాకిమిడి: ఒడిశాలో పర్లాకిమిడి సమీపంలోని ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గురువారం వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వనరుల నిర్వహణపై అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బినోద్ ఆత్రేయ (నేపాల్), ఆపరేషనల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఓఆర్‌ఎస్‌ఐ) భువనేశ్వర్ డాక్టర్ రబినారాయణ సుబుద్ధి, ప్రొఫెసర్ మోనీ మడస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ అంశాలపై దేశ విదేశాలకు చెందిన నిష్ణాతులు కూలంకషంగా మాట్లాడారు. రెండురోజుల ఈ సదస్సుకు సెంచూరియన్ వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయిక్ అధ్యక్షత వహించారు. ఆపరేషనల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఓఆర్‌ఎస్‌ఐ) భువనేశ్వర్ డాక్టర్ రబినారాయణ సుబుద్ధి మాట్లాడుతూ.. సెంచూరియన్ వర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో వికసిత్ భారత్, వాటి సుస్థిర లక్ష్యాలు, అభివృద్ధి, టెక్నాలజీ వంటి అంశాలపై 15 దేశాల నుంచి 160 పరిశోధన పేపర్లు అందాయన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలు, అభివృద్ధిపై ఒక సావనీర్‌ను విడుదల చేశామన్నారు.



ఎంఎస్ స్వామినాథన్ వర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థుల ప్రదర్శన

అగ్రికల్చర్ విద్యార్థుల ప్రదర్శన

సదస్సులో భాగంగా ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డ్రోన్స్ ద్వారా మందుల పిచికారీ, వివిధ పంటనాశినీ కీటకాలు, వ్యవసాయ క్షేత్రాలపై పరిశోధనల ప్రాజెక్టులు ప్రదర్శించారు. వాటిని అతిథిలు వీక్షించి విద్యార్థులను అభినందించారు. లాభసాటి వ్యవసాయానికి వినూత్న ఆలోచనల అవసరం ఉందని పేర్కొన్నారు.

చేతబడి నెపంతో వెలి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి సర్గిగూడ గ్రామంలో చేతబడి చేస్తున్నాడనే నెపంతో భక్తరామ్ హంతాల్ కుటుంబాన్ని గ్రామస్తులు వెలివేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో భక్తరామ్‌కు 7 ఎకరాల పొలం ఉంది. దీంతో ఆవులు, మేకలు మేపుతూ ఊరులో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత నెల రోజుల్లో గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అనారోగ్యంతో మృతి చెందారు. వారిద్దరికీ భక్తరామ్ చేతబడి చేశాడు అని గ్రామం మొత్తం నమ్మింది. దీంతో ఆ కుటుంబాన్ని గ్రామస్తులు వెలివేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోవింద పాత్రో వద్ద వీరు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన సలహా మేరకు కోరుకొండ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మల్కన్‌గిరి ఎస్‌డీపీవో సచిన్ పటేల్ మాట్లాడుతూ.. సర్గిగూడ గ్రామస్తులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి మాట్లాడతామని తెలిపారు. మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించి, భక్తరామ్ కుటుంబాన్ని గ్రామంలోనే ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు.



పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన భక్తరామ్ కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

పరిహారం అందజేత

కొరాపుట్: జిల్లాలోని తెంతులకుంటి సమితి కొంటాగాం గ్రామానికి చెందిన 5 ఏళ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.2.5 లక్షల పరిహారం ప్రభుత్వం అందించినట్లు పోలీసులు ప్రకటించారు.

66 మందికి భూపట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న బీడీవో రాజీవ్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ గోవిందపూర్ పంచాయతీలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ అభియాన్‌లో భాగంగా పరిపూర్ణత శిబిరాన్ని మోహనా బీడీవో రాజీవ్ దాస్ గురువారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మోహనా బ్లాక్‌లో మలాస్‌పదర్, జోరు, గోవిందపూర్ పంచాయతీల్లో 66 మంది లబ్ధిదారులకు జంగిల్, భూపట్టాలను తహసీల్దార్ సత్యవాన్ నైకా, రెవెన్యూ సూపర్‌వైజర్ మైఖెల్ రైకా అందజేశారు. కార్యక్రమంలో ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్ కుమార్, జిల్లా ఆధార్ మేనేజర్ పి.శ్యామ్, మలాస్‌పదర్ సర్పంచ ఇస్మాయిల్ దళ బెహరా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ పంచాయతీ సమితి కార్యాలయంలో 38 మంది దివ్యాంగులకు వీల్ చైర్లు, త్రిచక్ర వాహనాలు, బ్లైండ్ స్టిక్స్, స్మార్ట్‌క్యాన్‌లు గురువారం జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్ చేతుల మీదుగా అందజేశారు. రాయఘడలో ఎవరైనా దివ్యాంగులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని బీడీవో సుధీర్ కుమార్ సింగ్ సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ సామాజిక సురక్షా అధికారి నమితా చాంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

పర్లాకిమిడి: జిల్లావ్యాప్తంగా 200 మంది నర్సులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. నర్సులపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించినా లెక్కచేయకుండా పర్లాకిమిడి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో గజపతి జిల్లా నర్సింగ్ సంఘం ఆందోళనకు దిగారు. తమ న్యాయమైన పది డిమాండ్లు పరిష్కరించకుంటే శుక్రవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని, అత్యవసర విధులను కూడా బహిష్కరిస్తామని ఆల్ ఒడిశా నర్సుల సంఘం అధ్యక్షురాలు అనితా కుమారీ పాత్రో విలేకరులతో అన్నారు. నర్సులకు కంపెన్సేటరీ లీవు, కేబీకే అలవెన్సు, పదోన్నతులు కల్పించాలన్న తదితర డిమాండ్లపై ఆందోళన జరుపుతున్నారు.

పౌష్టికాహార పదార్థాల తయారీతో ఆర్థిక ప్రగతి

జయపురం: పౌష్టికాహార పదార్థాల తయారీతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక ప్రగతి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి కనుచరణ్ దాస్ అన్నారు.స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఒడిశా వ్యవసాయ విభాగం సహకారంతో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన ఆహార మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆహార మేళాలో మినుములు, మొక్క జొన్నలు, రాగులు, వేరుశనగలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంగీత బెహర, భువనేశ్వర్ ఏఎఫ్‌సీ ఆదిత్య మహంతి తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ పాఠశాలలు ఆశా దీపాలు'



విద్యార్థుల నృత్య ప్రదర్శన

రాయగడ: ఆదివాసీ విద్యార్థులకు ఉచితంగా విద్య అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆదర్శ విద్యాలయాలు విద్యార్థుల ఆశా దీపాలుగా మారాయని జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్ అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జిల్లాలోని 11 సమితుల్లోని ఆదర్శ పాఠశాలల 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్పార్క్‌–24 పేరిట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ఆదర్శ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నోడల్ అధికారి జ్యోతిర్మయి సాహు పాల్గొన్నారు.

జల జగడానికి ఫుల్‌స్టాప్..!

- మహానది వివాదం పరిష్కరిస్తాం
- కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హామీ
- హర్షం వ్యక్తం చేసిన సీఎం మోహన్ చరణ్ మాఝి



కేంద్రమంత్రి పాటిల్‌తో సీఎం మోహన్‌చరణ్ సమావేశం



మహానది

భువనేశ్వర్: త్వరలో మహానది జలాల పంపిణీ వివాదం పరిష్కారం కానుంది. ఈ మేరకు కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ హామీ ఇచ్చారు. ఆయన ఒక్కరోజు రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని గురువారం విచ్చేసిన సందర్భంగా ఈ విషయం తెలిపారు. ఆయన రాక పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్థానిక రాష్ట్ర అతిథి గృహంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జల విద్యుత్, సాగు నీరు ఇతరేతర జల వనరుల సంబంధిత అంశాలను చర్చించినట్లు సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అభ్యర్థనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

దీర్ఘకాలంగా వివాదం

పొరుగు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంతో మహానది జలాల పంపిణీ వివాదం దీర్ఘకాలంగా కొనసాగుతోంది. ఈ వివాదం న్యాయస్థానాల విచారణ పరిధిలో ఊగిసలాడుతోంది. అయితే త్వరలో ఈ పరిస్థితికి తెరదించనున్నట్లు కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ ప్రకటించారు. సంబంధిత జల వివాద పరిష్కార ట్రిబ్యునల్ వర్గాలు అత్యధిక ప్రాధాన్యతతో విచారణ కొనసాగిస్తున్నాయి. ఉభయ రాష్ట్రాలకు మేలు చేకూర్చే దిశలో పరిష్కారం కోసం ఈ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. అయితే చట్టబద్ధమైన పరిష్కారం కోసం ఉభయ వర్గాల వాదోపవాదనలను న్యాయ సంస్థలు లోతుగా సమీక్షిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో ఛత్తీస్‌గడ్ ఆగడాలతో రాష్ట్రం ఏటా మహానది నీటి వనరులను స్వేచ్ఛగా వినియోగించుకోలేని దయనీయ పరిస్థితులు తాండవిస్తున్నాయి. వర్షాకాలం కాని రోజుల్లో ఛత్తీస్‌గడ్ మహానది ఎగువ నుంచి నదీ జలాలను దిగువ ఒడిశా రాష్ట్రానికి విడుదల చేయకుండా నియంత్రిస్తోంది. దీంతో ఈ నీటి వనరులపై ఆధారపడిన జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఈ తీర ప్రాంతాల పారిశ్రామిక సంస్థలకు నీటి కొరత తలెత్తుతోంది. ఈ విచారకర పరిస్థితుల ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలంగా పోరాడుతున్నా ఛత్తీస్‌గడ్ మాత్రం బోద్యం చూస్తోంది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్ర ప్రభుత్వం నోరు మెదపకుండా మౌనం వహించి కాలయాపనను ప్రేరేపిస్తుంది.

వివాద పరిష్కారం ధ్యేయం

మహానది జలాల పంపిణీ కోసం ఉభయ ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాలు సిగపట్లు పట్టడంతో మహానది జలాల పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు చొరవతో 2018 సంవత్సరం మార్చి 12వ తేదీన ఈ ట్రిబ్యునల్ ఏర్పాటైంది. అయితే న్యాయస్థానంలో ఈ వివాదం ఇంతవరకు కొలిక్కి రాకపోవడం విచారకరం.

ఫలించని సంప్రదింపులు

మహానది జలాల పంపిణీ వివాదం పరిష్కారానికి ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల మధ్య సంధి కుదిర్చేందుకు ప్రభుత్వ స్థాయిలో చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. మధ్యవర్తిత్వం తటస్థ వైఖరితో ఈ పరిస్థితి తాండవించింది. కాగా ఒక్కరోజు పర్యటనకు విచ్చేసిన మంత్రి సి. ఆర్. పాటిల్ నగరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు. ఏక్ పేడ్ మా కే నామ్ శీర్షికతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. భారత ప్రభుత్వం సంకల్పించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఊరూవాడ మొక్కలను పెంచడంతో పర్యావరణ పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు.

సౌర విద్యుత్ పెంపొందించేందుకు కృషి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎస్ మనోజ్ ఆహుజా

- సీఎస్ మనోజ్ ఆహుజా

భువనేశ్వర్: రాష్ట్రంలో సౌర విద్యుచ్ఛక్తి వినియోగం పెంపొందించేందుకు ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని సీఎస్ మనోజ్ ఆహుజా అన్నారు. డాబాలపై ఈ వ్యవస్థ పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్‌సేవ భవన్‌లో గురువారం తొలి రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యుత్ విభాగం ప్రముఖ కార్యదర్శి హేమంత శర్మ, ఆర్థిక శాఖ ప్రముఖ కార్యదర్శి శాశ్వత్ మిశ్రా, నిర్మాణ శాఖ ప్రముఖ కార్యదర్శి వీర్ విక్రమ యాదవ్‌తో విద్యుత్ పంపిణీ సంస్థల ప్రముఖులు, గ్రిడ్కో, ఒరేడా సంస్థల అధికార ప్రతినిధులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పురోగతిని సీఎస్ సమీక్షించారు. ఈ పథకం కింద డాబాలపై సౌర విద్యుచ్ఛక్తి వినియోగం విస్తరించాలని తెలిపారు. సాధారణ ప్రజలకు గ్రీన్ ఎనర్జీ వినియోగంపై చైతన్యపరచి ప్రోత్సహించాలని వివరించారు.

సైబర్ క్రైంపై అవగాహన శిబిరం



సైబర్ నేరాలపై వివరిస్తున్న సంజయ్ పాఢి

పర్లాకిమిడి: జిల్లా న్యాయసేవ ప్రదీకరణ ఆధ్వర్యంలో గజపతి జిల్లా జడ్జి కోర్టు సమావేశ హాల్‌లో సోషల్ మీడియా, సైబర్ క్రైంపై గురువారం అవగాహన శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రైణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. దీనిలో భాగంగా సైబర్ క్రైం, సోషల్ మీడియాలు ఎలా దెబ్బతీస్తున్నాయో కుటుంబ కోర్టు న్యాయమూర్తి అశోక్ కుమార్ పోయి మాట్లాడారు. కార్యక్రమంలో ముఖ్య విచారణ అధికారి నరోత్తమ శెఠి, సీనియర్ దేవానీ అధికారి సంతోష్ కుమార్ అగర్‌వాల్, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ ప్రసన్న కుమార్ బెహరా, లీగల్ సర్వీస్ ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రౌళో, మహిళా అదాలత్ కోర్టు న్యాయమూర్తి రస్మితా సాహు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎల్ఎఫ్ కార్యకర్తల ఆందోళన ఉధృతం



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయగడ: తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఆందోళన చేపట్టిన గ్రామ పంచాయతీ లెవెల్ ఫెడరేషన్(జీపీఎల్ఎఫ్) కార్యకర్తలు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. దీనిలో భాగంగా వందలాది మంది కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం తమ నిరసన తెలియజేశారు. 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు, గత ఆరు నెలలుగా వేతనాలను చెల్లించడం లేదని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఒక వినతిపత్రంను కలెక్టర్ ఫరూల్ పట్వారికి అందించారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొమాంగో తదితరులు

రాయగడ: అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న గుణుపూర్ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం గుణుపూర్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జనాభా పరంగా పట్టణం అభివృద్ధి చెందుతోందని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి మనోజ్ కుమార్ తండి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే ట్యాక్సుల రూపంలో నిధులను సంగ్రహించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇదిలా ఉండగా పట్టణంలోని బిజూ పట్నాయక్ కల్యాణ మండపం, టౌన్‌హాల్‌లను ఆధునికీకరించేందుకు తీర్మానించారు. త్వరలో వాటి అభివృద్ధికి అవసరమయ్యే నిధుల కోసం అంచనా వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమత గౌడో, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం జప్తు

భువనేశ్వర్: కటక్ ప్రాంతంలో అక్రమ మద్యం లావాదేవీలపై అబ్కారీ విభాగం ఆకస్మిక దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో కటక్ జిల్లా బంకి ప్రాంతంలో 4 చక్రాల వాహనంతో 510 లీటర్ల అక్రమ మద్యం స్వాధీన పరచుకుంది.

ఈ వ్యవహారంలో సన్నాముండొలి ప్రాంతీయుడు బొసాంతొ బెహరాని నిందితునిగా గుర్తించి అరెస్టు చేశారు.

పోలీసులు విధులకు పరిమితమవ్వాలి

భువనేశ్వర్: విధి నిర్వహణలో నిబంధనల మేరకు కేటాయించిన కార్యకలాపాలకు పోలీసులు పరిమితం కావాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా తెలిపారు. ప్రధానంగా గనుల ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో నియమితులైన పోలీసు వర్గాలు ఇతరేతర కార్యకలాపాలపై చొరవ కల్పించుకుంటున్నట్లు వ్యాపించిన ఆరోపణలపై పోలీసు ప్రధాన కార్యాలయం ఘాటుగా స్పందించింది. ఈ ప్రాంతాల్లో పోలీసు కార్యకలాపాలు మినహా ఇతర వ్యవహారాల్లో చొరవ కల్పించుకుంటే కఠిన క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు కావలసి ఉంటుందని హెచ్చరికలు జారీ చేశారు.

43 మండలాలకు కొత్త అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో 43 మండలాలకు కొత్త అభివృద్ధి అధికారులను (బీడీఓ) నియమించారు. 59 మంది ఓఏఎస్ అధికారుల బదిలీ చేయడంతో ఈ మార్పు చోటు చేసుకుంది. ఈ ప్రక్రియలో 3 మంది బీడీఓలను రెవెన్యు విభాగానికి తరలించారు. ముఖ్యమంత్రి ప్రజాభియోగాల కార్యాలయంలో 4 మందిని కొత్తగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

విజ్ఞాన మేళ ప్రదర్శన



విజ్ఞాన మేళాను తిలకిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియం వద్ద అరవింద పూర్ణాంగ శిక్షా కేంద్రంలో నిర్వహించిన విజ్ఞాన మేళాను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్య అతిథిగా విచ్చేసి గురువారం ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను సందర్శించి, వారికి మరింత ప్రోత్సాహం అందించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, విద్యాలయం ప్రధాన ఆచార్యులు అరవింద్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల తయారీపై పటిష్ట నిఘా

భువనేశ్వర్: ప్రపంచ ప్రసిద్ధ పూరీ శ్రీజగన్నాథ స్వామి ప్రసాదాల తయారీపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పాలక వర్గం నిర్ణయించింది. ఈ దేవస్థానంలో ఇప్పటివరకు ప్రసాదాల తయారీలో అభ్యంతరకర వ్యాఖ్యలు, ఆరోపణలు వెలుగు చూడలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. దేశంలో కలకలం రేపుతున్న తాజా పరిణామాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా శ్రీమందిరంలో ఆహార అధికారి (ఫుడ్ ఇన్‌స్పెక్టర్)ని నియమించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. స్వామివారి నివేదన కోసం నిత్యం లెక్కకు మిక్కిలిగా పలు రకాల ప్రసాదాలు తయారు చేస్తారు. శ్రీమందిరంలో పోటులో నిత్యం మహా ప్రసాదంతో పలు రకాల పొడి ప్రసాదాలను తయారు చేస్తారు. వీటి వినియోగంలో నెయ్యి వాడకం నిరవధికంగా కొనసాగుతుంది.

ప్రధానంగా పొడి పదార్థాల వంటకాల్లో నెయ్యి అధికంగా వినియోగిస్తున్నారు. ఈ నేతిలో నాణ్యత పరీక్షించేందుకు ప్రత్యేక జాగ్రత్త వహించనున్నట్లు వివరించారు. స్వామి నివేదన అనంతరం భక్తులు, యాత్రికులు వినియోగించే మహా ప్రసాదం ఇతరేతర ప్రసాదాల తయారీలో నాణ్యతని కొత్తగా నియమితులు కానున్న ఆహార అధికారి నిత్యం పర్యవేక్షిస్తారని తెలిపారు.

ముగిసిన శాలినీ పండిట్ పర్యటన



మెగా తాగునీటి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న పండిట్

రాయగడ: రాష్ట్ర స్కూల్ అండ్ మాస్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శాలినీ పండిట్ ఈనెల 24 నుంచి రాయగడలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి గురువారంతో ఆమె పర్యటన ముగించారు. సమితిలోని తడమ ఆదర్శ విద్యాలయంలో పర్యటించిన ఆమె విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పితామహాల్ ఉప ఆరోగ్య కేంద్రంలో పర్యటించి వైద్య సౌకర్యాల గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రం, మా అగ్ని గంగమ్మ స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో సమావేశమయ్యారు. బిసంకటక్‌లో మిషన్ శక్తి మహిళలు నిర్వహిస్తున్న మిషన్ కేఫేపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పురుణాపాణి గ్రామంలో కొనసాగుతున్న మెగా తాగునీటి ప్రాజెక్టు పనులను పరిశీలించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పండిట్, కలెక్టర్ పట్వారీలు

దుర్గీలోని ఆదర్శ విద్యాలయం విద్యార్థులతో మాట్లాడి, అనంతరం వారిలో కలిసి భోజనం చేశారు. ఆమెతో పాటు కలెక్టర్ ఫరూల్ పట్వారి తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని గడ్డి శిఖాల్ పంచాయతీ కార్యాలయానికి గ్రామస్తులు గురువారం తాళం వేశారు. గ్రామానికి రహదారి, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఎన్నికల సమయంలో నాయకులు తమ గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని ఆశ చూపి, ఎన్నికల అనంతరం కనిపించకుండా పోయారని ఆరోపించారు. గ్రామ సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమాచారం తెలుసుకున్న పంచాయతీ అధికారులు గ్రామానికి వెళ్లారు. సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

విచ్ఛిన్న శక్తులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



సభ్యత్వ నమోదు ప్రచార సభలో మాట్లాడుతున్న జేపీ నడ్డా

భువనేశ్వర్: కాంగ్రెస్ అర్బన్ నక్సలిజానికి అధికార ప్రతినిధిగా మారి, విచ్ఛిన్న శక్తులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రానికి విచ్చేసిన ఆయన నగరంలో గురువారం ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మానసిక ప్రశాంతత కొరవడిందని ఎద్దేవా చేశారు. ప్రధానంగా ముస్లిం మహిళలకు బీజేపీ కల్పించిన సాధికారితతో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరమైందన్నారు. కాంగ్రెస్ హయాంలో లౌకికవాదం ముసుగులో ట్రిపుల్ తలాక్ పేరుతో మహిళల ప్రాథమిక హక్కులను కాలరాసిందని గుర్తు చేశారు. మోదీ సర్కార్ ట్రిపుల్ తలాక్ వ్యవస్థని రద్దు చేసి ముస్లిం మహిళలను శక్తివంతం చేసిందని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం బహుముఖ రంగాల్లో అగ్రగామిగా దూసుకుపోతోందని పేర్కొన్నారు. దీనికి బొమ్మలు, మొబైల్ ఫోన్ల ఎగుమతిలో అగ్రస్థానానికి చేరుకోవడం తార్కాణంగా పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక రంగం అభివృద్ధిలో 5వ అతిపెద్ద దేశంగా వెలుగొందుతుందన్నారు. సంక్షేమమే తారకమంత్రంగా బీజేపీ హయాంలో పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఒడిశా బహుముఖాభివృద్ధి బాటలో దూసుకుపోతుందని ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. సంపన్న ఒడిశా నిర్మాణానికి ప్రజలంతా సహృదయంతో సహకరించాలని పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వానికి పరోక్షంగా ప్రోత్సహిస్తూ ఈ పిలుపునివ్వడం గమనార్హం. పార్టీలో కోటి మందిని సభ్యులుగా చేర్పడం లక్ష్యంగా పేర్కొన్నారు. తమ పాలనలో నూతన ఒడిశా నిర్మాణ కళ సాకారం అవుతుందన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

మల్కన్‌గిరి: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం సీఎం మోహన్‌చరణ్ మాఝి, ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి వినతిపత్రాన్ని కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్‌పాటిల్‌కు అందజేశారు. సమస్యకు పరిష్కారం లభించకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. బుధవారం సాయంత్రం బొబ్బిలి నుంచి తెర్లాం మీదుగా వెళ్తున్న లారీ స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై గ్రామానికి చెందిన వెంపడాపు భీమయ్యను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భీమయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే రాజాం కేర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా భీమయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, వివాహమైన ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాజాం సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోనేరులో కాలు జారిపడి మహిళ..


అన్నపూర్ణ మృతదేహం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం అగ్రహారంలో గల కోనేరులో కాలు జారిపడి ఓ మహిళ మృతి చెందింది. గురువారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అగ్రహారానికి చెందిన ఎం.అన్నపూర్ణ (40) స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కోనేరులో పడిపోవడంతో స్థానికులు స్పందించి బయటకు తీసినప్పటికే ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటరమణ (ఫైల్)

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామానికి చెందిన కోడిశ వెంకటరమణ (42) తీసుకున్న అప్పులు తీర్చలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు అందించిన సమాచారం మేరకు వెంకటరమణ బొలెరో వ్యాన్ నడుపుకుంటూ మరో పక్క వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య చంద్రకళతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తనకు ఉన్న సొంత ఇంటిమీద కూడా అప్పులు చేశాడు. నెలవారీ అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది బుధవారం రాత్రి గ్రామం బయట పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు వెంకటరమణను రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై గౌరునాయుడు తెలిపారు.

అన్నదాతకు రూ.20 వేలు అందజేయాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: అన్నదాతకు పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ.20వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను అమలు చేయాలన్నారు. రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ మోటార్ల మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన జీఓ 22 రద్దు చేయాలన్నారు. భూయాజమాని సంతకంతో పనిలేకుండా వాస్తవ సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తింపజేయాలన్నారు. ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని క్రషింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తొత్తడి పైడిపినాయుడు, కార్యదర్శి రాకోటి రాములు, రైతు సంఘం నాయకులు గంగునాయుడు, నాగేశ్వరరావు, సూరిదేవుడు, సంతోష్, కోటి, గోపాలం పాల్గొన్నారు.

తీరంలో అప్రమత్తం

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తాడ్డి గోవింద తెలియజేశారు. వర్షాల కారణంగా కొత్త నీరు సముద్రంలో చేరడంతో కడలి అల్ల కల్లోలంగా మారుతోందన్నారు. అలల ఉధృతికి సముద్రం ముందుకు రావడంతో తీరం కొన్ని చోట్ల కోతకు గురైంది. తీరంలో ఉన్న పడవలు, వలలను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, తిప్పలవలస, కోనాడ గ్రామాల్లో మత్స్యకారులు వర్షాల కారణంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలని తహసీల్దార్ సూచించారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న తిప్పలవలస, చింతపల్లి, పతివాడబర్రిపేట, కోనాడ గ్రామాల్లో భారీవర్షాలు, గాలులు వీస్తున్నందున మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు.

వారెవ్వా..!

నేడు ఆడలి వ్యూపాయింట్ ప్రారంభం

ఎంత బిజీగా ఉన్నా సరే ప్రయాణాలకు సమయం కేటాయిస్తుంటారు చాలామంది. కొందరు కుటుంబాలతో..మరికొందరు స్నేహితులతో ట్రిప్‌లు వేస్తుంటారు. ప్రతి మనిషి జీవితంలో అలిసిపోయి మానసిక ప్రశాంతతను, విరామాన్ని కోరుకుంటాడు. ఆ సమయంలో కొత్త ప్రదేశాలకు వెళ్లి ఉల్లాసంగా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాడు. అలాంటి వారికి పర్యాటకం ఓ అద్భుతమైన అవకాశం. ఈ నేపథ్యంలో దేశంలో ఎక్కడ అందమైన, మనసుకు ఉల్లాసం కలిగించే ప్రదేశాలు, ప్రాంతాలు ఉన్నాయో తెలుసుకుని మరీ వెళ్లి వీక్షించి మనసు నిండా సంతోషాన్ని, సంతృప్తిని నింపుకుని వచ్చి మళ్లీ బిజీ లైఫ్‌లో పడిపోతుంటారు.

- మది దోచే మన్యం అందాలు
- హొయలొలికే జలపాతాలు
- ఆహ్లాదం పంచే అడవులు, కొండలు
- ఆకర్షణగా అడ్వెంచర్ పార్కు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట మన్యం అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఇక్కడి పర్యాటక ప్రదేశాలు ఆకట్టుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకానికి పెద్దపీట వేశారు. ప్రతిరోజూ పర్యాటకులు సీతంపేటను చుట్టి వస్తున్నారు. సెలవురోజుల్లో అయితే ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా స్థానికంగా దోనుబాయి రోడ్డు సమీపంలో అడ్వెంచర్ పార్కు ఉంది. ఇక్కడి జలవిహార్‌లో బోటింగ్, కయాకింగ్, కొరాకిల్; హ్యాంగింగ్ బ్రిడ్జి ప్రత్యేకం .ఫైవ్ డీ థియేటర్ కూడా పునఃప్రారంభం కానుంది.


వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి చేసిన ఆడలి వ్యూపాయింట్

సీతంపేటలో పర్యాటక దినోత్సవం..

సీతంపేటలోనే ఘనంగా పర్యాటక దినోత్సవం నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక అడ్వెంచర్ పార్కులో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఆడలి వ్యూపాయింట్ వద్ద అతిథుల రాక, ఆడలి వ్యూపాయింట్, టెంటెడ్ అకామడేషన్, రెస్టారెంట్ ప్రారంభించనున్నారు. స్టాల్స్ విజిట్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక అడ్వెంచర్ పార్కు వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సీతంపేట ఏజెన్సీలో అతిపెద్ద వ్యూపాయింట్ ఆడలిగా చెప్పుకోవచ్చు. ఇక్కడి నుంచి చూస్తే హిరమండలం ప్రాంతంలో వంశధార నదీతీర ప్రాంతాలు చూపరులను ఎంతో ఆకట్టుకుంటాయి. పాలకొండ-సీతంపేట మార్గంలో కుశిమి రహదారి గుండా శంభాం మీదుగా ఆడలి పర్యాటకులు చేరుకోవాలి. ఇక్కడ హోటల్స్ వంటివి ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


వ్యూపాయింట్ వద్ద రహదారి



అడ్వెంచర్ పార్కు


వ్యూ పాయింట్ వద్ద రెస్టారెంట్

జాలువారే జలపాతాలు


మెట్టుగూడ జలపాతం

జాలువారే జలపాతాలు పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సీతంపేట నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మెట్టుగూడ జలపాతం ఉంది. ఇక్కడ నీరు ఈ సీజన్‌లో సెలయేరులా పారుతుంది. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ఉండడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే సీతంపేట నుంచి దోనుబాయి వెళ్లి అక్కడి నుంచి మరో మూడు కిలోమీటర్లు వెళ్తే సున్నపుగెడ్డ జలపాతం వస్తుంది. ఇక్కడ కూడా అనునిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఎంతో కాలంగా పర్యాటకుల తాకిడి ఇక్కడే ఎక్కువగా కనిపిస్తుంది. మల్లెమ్మ గెడ్డ జలపాతం సంతమల్లి సమీపంలో ఉంది. కుశిమి వెళ్లే రహదారిలో ఇది ఉంది. ఇకపోతే సీతంపేట నుంచి దోనుబాయి వెళ్లే మార్గంలో ఉండే చంద్రమ్మగుడికి కూడా పర్యాటకులు వచ్చి పోతుంటారు. ఒగా దీన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన


కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం సందర్శించారు. వివిధ ప్రాంతాలు, రహదారి కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, వాటి లైవ్ వీడియోలను ఈ సందర్భంగా పరిశీలించారు. రహదారి ప్రమాదాలు, దొంగతనాలు జరిగినపుడు వాహనాలను కంట్రోల్ రూమ్ నుంచి ఏవిధంగా ట్రాక్ చేయవచ్చు, సీసీ ఫుటేజీలన, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న ప్రాంతాలను, ప్రత్యక్షంగా జరుగుతున్న ధర్నాలను, సంఘటనలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచే ఎలా పర్యవేక్షించవచ్చునన్న అంశాలను ఎస్పీ పరిశీలించారు. సిగ్నల్ పాయింట్ల వద్ద ఎం.వి. నిబంధనలు పాటించకుండా సిగ్నల్ జంపింగుకు పాల్పడుతున్న వాహనదారులపై ఆటోమేటిక్ గా ఈ-చలానా జనరేట్ అవుతాయని, నిబంధనలు అతిక్రమించినట్లుగా రుజువు చేస్తూ అందుకు సంబంధించిన సాక్ష్యాలుగా సీసీ కెమెరాల్లో ఫోటోలు నిక్షిప్తమవుతాయని కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, ఆర్‌టీజీ సిబ్బంది ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏవీ లీలారావు, ఇతర అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసిల్ట్ తొలగింపు పరిశీలన


సువర్ణముఖి నదిలో డీసిల్ట్ తొలగింపు పనులు పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామ సమీపంలో సువర్ణముఖి నదిలో మట్టి, మడ్డి, ఇసుక (డీసిల్ట్) తొలగింపు పనులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ గురువారం పరిశీలించారు. నదిలో ప్రస్తుతం ఉన్న నీటిప్రవాహం, మడ్డి, మట్టి, ఇసుక వేరుచేసే ప్రక్రియపై సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. యంత్రాలు ఉపయోగించి సిల్ట్ తొలగించకూడదని, కూలీలతో తొలిగించాలని ఉత్తర్వుల్లో ఉందని అధికారులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. బహిరంగ ఇసుక రీచ్‌లలో యంత్రాలు వినియోగించకూడదని, డీసిల్ట్ పనుల్లో యంత్రాలు ఉపయోగించవచ్చునని, ఈ అంశంపై అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని జేసీ వెల్లడించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌కు వెళ్లే వాహన వివరాలను నమోదు చేయాలని కొండచాకరాపల్లి, కొప్పర సచివాలయాల సిబ్బందిని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. నదిలో నీటిప్రవాహం ఉన్నందున డీసిల్ట్ తొలగింపులో కొంత జాప్యం జరుగుతోందని, నదిలో 3.4 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పనులు చేపడతామని తెలియజేశారు. మట్టి, మడ్డిని తమ గ్రామానికి రక్షణ గట్టుగా వేయాలని కొండచాకరాపల్లి గ్రామస్తులు కోరారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. 82 మంది విద్యార్థుల నుంచి 82 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వాస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది సేకరించారు. జేఎన్‌టీయూజీవీ ఇంజినీరింగ్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు ముందుగా రక్తదానం చేసి అందరినీ ఉత్సాహపరిచారు. రక్తదాన శిబిరాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.ధర్మారావు పాల్గొని విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యులు సునీల్, శిరీష, సీహెచ్ నందిని, బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ అప్పలనాయుడు, వైద్య సిబ్బంది, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి అధికారిగా ప్రశాంత్ కుమార్

విజయనగరం అర్బన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా గరుడపల్లి ప్రశాంత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆయన అల్లూరి సీతారామారాజు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ నైపుణ్యాభివృద్ధి అధికారిగా పనిచేసిన గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

గిరిజన వర్సిటీలో ఘనంగా స్వచ్ఛతా హి సేవ


మొక్క నాటుతున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో గురువారం ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరు మీద ఒక చెట్టు) కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి తన తల్లి ''సంగమ్మ'' పేరు మీద ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మన అందరిలో స్ఫూర్తిని నింపారని ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని తమ తల్లి పేరు మీద కనీసం ఒక్క మొక్కనైనా నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ విభాగాధిపతి డా. బొంతు కోటయ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు. యూనివర్సిటీ డీన్లు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు తమ తమ తల్లి పేరు మీద మొక్కలను నాటారు.

సీపీఆర్‌తో పునర్జన్మ

- ఎస్పీ వకుల్ జిందాల్


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం టౌన్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌లో పోలీసు సిబ్బందిని సుశిక్షితులను చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రబమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ-ఫ్రంట్ లైన్ వారియర్‌గా సమాజానికి ఇంకామెరుగైన సేవలందించేందుకు పోలీసు సిబ్బంది సీపీఆర్ నిర్వహించడంలో సుశిక్షితులను చేసేందుకు తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా రహదారి ప్రమాదం లేదా మరేదో సంఘటన జరిగినట్లు సమాచారం అందిన వెంటనే ఫ్రంట్ లైన్ వారియర్‌గా సంఘటనా స్థలానికి ముందుగా చేరేది పోలీసులేనని, సంఘటనా స్థలంలో గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న వారికి అవసరాన్ని బట్టి గోల్డెన్ అవర్స్‌లో సీపీఆర్ చేస్తే, వారికి పునర్జన్మ అందించిన వారమవుతామన్నారు. అయితే, సీపీఆర్ ఎప్పుడు, ఎలా, ఎంతసేపు నిర్వహించాలన్న విషయాలపై తప్పనిసరిగా పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎం.డి. డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ-దొమ్మీలు, తొక్కిసలాటలు జరిగినపుడు మనల్ని మనం రక్షించుకుంటూ, ఇతరులను రక్షించేందుకు పోలీసు సిబ్బందికి తప్పనిసరిగా సీపీఆర్ చేసే విధానం పట్ల అవగాహన ఉండాలని అభిప్రాయ పడ్డారు. తిరుమల-మెడికవర్ ఆసుపత్రి కార్డియాక్ వైద్యుడు డా.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ-ఏ పరిస్థితుల్లో సీపీఆర్ అందించాలన్న విషయం పట్ల అవగాహన అవసరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డా.జి.రామారావు, డా. షరీన్ హసన్ భట్, డా.రామలక్ష్మి, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఎస్సైలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, ఆస్పత్రి టెక్నీషియన్ కేవీ సాయికుమార్, జి.దుర్గారావు, ఆర్ఎస్సైలు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా ఇవ్వండయ్యా..!

- రైతుల ఆరాటం
- ఎరువు కోసం వెతుకులాట
- పొటాష్ కూడా దొరకని పరిస్థితి
- అధిక ధరకు విక్రయిస్తున్న ప్రైవేట్ డీలర్లు
- స్పందించని వ్యవశాయ శాఖ అధికారులు



యూరియా బస్తాలు

విజయనగరం ఫోర్ట్: ఇది ఈ ఇద్దరి రైతుల పరిస్థితే కాదు. అనేక మంది రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 90వేల హెక్టార్లకు పైగా వరి పంట సాగైంది. రైతులు ప్రస్తుతం రెండో దఫా ఎరువు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు వేసేశారు. రెండో దఫాలో యూరియా, పొటాష్ కలిపి వేస్తారు. కొంతమంది రైతులు యూరియానే వేస్తారు. అయితే ప్రస్తుతం ఈ రెండు ఎరువులు ఎక్కడా దొరకడం లేదు. రైతుల సంక్షేమం కోసమే పాటుపడుతున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అవసరమైన ఎరువు కూడా అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మొదటి దఫాలో డీఏపీ దొరక్క ఇబ్బంది పడ్డారు. ప్రైవేట్ డీలర్ల దగ్గరకు వెళ్తే గుళికలు కొంటే గానీ డీఏపీ ఇవ్వని పరిస్థితి. ఇప్పుడు యూరియాతో పాటు పొటాష్ కూడా దొరకని పరిస్థితితో జిల్లా అంతటా రైతులు ఇబ్బంది పడుతున్నారు.



నాపేరు కర్రి రాజు. మాది విజయనగరం మండలం కోరుకొండ పాలెం గ్రామం. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట వేశాను. రెండో దఫా యూరియా వేసేందుకు రెండు బస్తాల కోసం రైతు సేవా కేంద్రానికి నాలుగు రోజుల క్రితం వెళ్లాను. యూరియా లేదని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.



నాపేరు పొటుపు రెడ్డి అప్పల నాయుడు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి పంట సాగు చేశాను. యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి వెళ్తే యూరియా లేదని చెప్పారు. కొత్తారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ప్రైవేట్ డీలర్ వద్దకు వెళ్తే అక్కడ లేదని చెప్పారు. రెండో దఫా ఎరువు వేయడానికి యూరియా దొరకడం లేదు. ఏం చేయాలో తెలియడం లేదు.

యూరియా దొరక్క అవస్థలు

రైతులు యూరియా దొరక్క పోవడం వల్ల అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ అధికారులు యూరియా ఉందని చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్తే యూరియా లేదు. నాలుగైదు రోజుల్లో వస్తుందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. కొంతమంది ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా ఉన్నప్ప టికీ వారు బ్లాక్ చేస్తున్నారు. యూరియా ఉన్నప్పటికీ లేదని చెబుతున్నారు. వారు చెప్పిన ధరకు కొంటేనే ఇస్తున్నారు. రూ.270కి విక్రయించాల్సిన బస్తా యూరియాను రూ.300కు అమ్ముతున్నారు. బస్తా ధర ఎందుకు పెంచారని రైతులు ప్రశ్నిస్తే యూరియా అయిపోయింది వెళ్లి పోండని కరాఖండిగా చెబుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రైవేట్ డీలర్లు కృతిమ కొరత సృష్టించడంతో పాటు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐదురోజుల్లో వస్తుంది

యూరియా కొన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఉంది. నాలుగైదు రోజుల్లో మరో యూరియా రేక్ వస్తుంది. రాగానే రైతు సేవా కేంద్రాలకు పంపిస్తాం.
వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

కనిపించని ఎరువుల ధర పట్టిక

ఎరువుల ధరల వివరాలు, స్టాకు వివరాలు తెలిపే బోర్డులు పెట్టాలని వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు డీలర్లకు పదేపదే చెబుతున్నారు. కానీ ఎక్కడా అది అమలు కావడం లేదు. జిల్లాలో 200 వరకు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. కొద్ది మంది డీలర్లు మాత్రమే ధరల వివరాలు బోర్డులు పెడుతున్నారు.

38, 447 మెట్రిక్ టన్నులు యూరియా విక్రయం

జిల్లాలో సెప్టెంబర్ 24 నాటికి 38, 447 మెట్రిక్ టన్నుల యూరియాను ఆర్‌బీకే, ప్రైవేట్ డీలర్లు విక్రయించారు. అదేవిధంగా 3,651 మెట్రిక్ టన్నుల పొటాష్ విక్రయించారు. 12,665 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయించారు. 11,684 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సు ఎరువులు విక్రయించారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 2361 మెట్రిక్ టన్నులు విక్రయించారు.

ప్రైవేట్ డీలర్లకే యూరియా, పొటాష్ ఎక్కువ కేటాయింపు

ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు కాకుండా ప్రైవేట్ డీలర్లకు యూరియా, పొటాష్ ఎరువులను ఎక్కువగా కేటాయింపులు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలకు ఎక్కువగా ఎరువులను కేటాయించేవారు. దీంతో రైతులకు గ్రామాల్లోనే ఎరువులు లభించేవి. ఇప్పుడు ఎరువుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు పరిగెత్తాల్సిన పరిస్థితి దాపురించింది.

కీచక పర్వంపై విచారణ

బొబ్బిలి: బాలికలతో స్నేహపూర్వకంగా ఉండాల్సిన ఓ ఉపాధ్యాయుడు సంస్కారం మరిచిన వైనంపై డీఎస్పీ పి.శ్రీనివాసరావు బుధవారం విచారణ జరిపి కౌన్సెలింగ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై విద్యాశాఖాధికారులు కూడా స్పందించారు. డీఈఓ ఆదేశాల మేరకు బొబ్బిలి డిప్యూటీ ఈఓ మోహనరావు బొబ్బిలి పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలకు గురువారం వెళ్లి విచారణ జరిపారు. ఇద్దరు ఎంఈఓలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపువాసు సమక్షంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వర కు ఉపాధ్యాయులు, విద్యార్థినులను వేర్వేరు గా విచారణ జరిపారు. వారి మాటలను రికా ర్డు చేశారు. సంస్కారం మరిచి ప్రవర్తించిన ఉ పాధ్యాయునికి హెచ్చరికలు జారీ చేశారు. నివే దికను డీఈఓకు అందజేస్తామని తెలిపారు.

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనారాయణంలో సీతారాముల శాంతి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణం చేపట్టినట్లు ప్రధానార్చకుడు రంగాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.